క్లుప్తంగా

ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న సాయి రామకృష్ణ

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాలలో నేర్పిన పాఠ్యాంశాలను తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పప్పు మాధవీదేవి, ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, ఏఎల్‌వీ కుమారి, వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధ మంగళ స్తోత్ర మహా పారాయణ



సిద్ధ మంగళ స్తోత్ర మహా పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో మంగళవారం 54 వేల శ్రీ సిద్ధ మంగళ స్తోత్ర మహా పారాయణ యజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. మహిళా భక్తులు తరలివచ్చి యజ్ఞంలో పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన, గణపతి సూక్త పారాయణ సిద్ధ మంగళ స్తోత్ర వివరణ, నామ భజన నిర్వహించారు. ఈనెల 29 వరకూ 54 వేల మహా పారాయణ జరుగుతుందని నారీ సేవా వ్యవస్థాపకురాలు బొట్ల లత తెలిపారు. విశ్వశాంతి, లోకకల్యాణార్థం సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఈ యజ్ఞం చేపట్టి నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



మరిడమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


విభిన్న ప్రతిభావంతులకు వాహనాల పంపిణీ



మూడు చక్రాల వాహనాలను లబ్ధిదారుకు అందజేసిన దొరబాబు తదితరులు

సామర్లకోట: స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ జిల్లా చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఆమె పాల్గొని వీటిని అందజేశారు. నియోజకవర్గానికి వచ్చిన 10 వాహనాలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా ముంతాజ్‌ను దొరబాబు సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు మంగతాయారు, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జాన్ పీటర్ ఇకలేరు



జాన్ పీటర్ (ఫైల్)

పెద్దాపురం: స్థానిక లూథరన్ పాఠశాలల కరస్పాండెంట్‌గా, ఉపాధ్యాయుడిగా సేవలందించి విశ్రాంత ఉపాధ్యాయుడు బూసీ జాన్ పీటర్ (87) మంగళవారం మృతి చెందారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసి, అందరి మన్ననలు పొందిన పీటర్ మృతితో పెద్దాపురం క్రిస్టియన్‌పేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి పట్టణ ప్రముఖులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పట్టణ పేదలకు పక్కా ఇళ్లు

- రూపాయికే సొంతింటి కల సాకారం
- సకల సదుపాయాలతో ముస్తాబు
- టిడ్కో లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు



పెద్దాపురంలో సుందరంగా నిర్మించిన జగనన్న టిడ్కో కాలనీ

పెద్దాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. రాష్ట్రాభివృద్ధే ఆశయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారు. ఒక్క రూపాయికే లక్షల విలువైన పక్కా ఇంటిని పేదలకు అందించే బృహత్తర కార్యక్రమానికి సీఎం జగన్ గత ఏడాది జూన్ 28న విజయనగరం జిల్లాలో శ్రీకారం చుట్టారు. జగనన్న టిడ్కో కాలనీల్లో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసి సొంతింటి కలను సాకారం చేశారు.

పట్టణాల్లో ఇళ్లులేని నిరుపేద కుటుంబాలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ పత్రాలను చేతికి అందిస్తానన్న సీఎం జగన్ హామీ సాకారమైంది.. నియోజకవర్గంలో సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో సుమారు 4368 మంది లబ్ధిదారులకు టిడ్కో ఫ్లాట్లను అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వం 'ఏ కేటగిరి' కింద ఒక్కో ఇంటిని రూ.6.55 లక్షల వ్యయంతో నిర్మిస్తోంది. ఆ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు ఇస్తోంది. మిగిలిన సొమ్ము రూ.5.05 లక్షలు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ నిర్మించి లబ్ధిదారులకు అందజేస్తోంది.' సీ కేటగిరి'లో 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.8.55 లక్షల చొప్పున నిర్మాణ వ్యయం అవుతోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.5 లక్షలు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2.9 లక్షలు సమకూరుస్తోంది. లబ్ధిదారుడి వాటాకింద రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు రుణం రూ.3.65 లక్షలను అధికారులు సమకూర్చారు.

ఇంట్లో చక్కని వసతులు

ఇళ్లలో టైల్స్‌తో కూడిన గచ్చు ఏర్పాటు చేశారు. బెడ్‌రూమ్, లివింగ్ రూమ్ ఆకట్టుకునేలా రూపొందించారు. గ్రానైట్ ప్లాట్‌ఫాంతో కూడిన వంట గది, సింక్ చక్కగా ఉన్నాయి. ఆధునిక వసతులతో కూడిన టాయిలెట్ చక్కగా ఉంది. కాలనీలో 40 అడుగుల వెడల్పుతో కూడిన రోడ్ల నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కల్పించారు.



ఫ్లాట్లను లాటరీ పద్ధతిలో కేటాయిస్తున్న అధికారులు (ఫైల్)





టైల్స్‌తో సుందరంగా ఉన్న టిడ్కో ఫ్లాట్లు, వంటగది

సొంతింటి కల సాకారం



పేదల సొంతింటి కల సాకారం చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యపడింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల ఇళ్ల నిర్మించడమే గాక పట్టణ ప్రాంత ప్రజలకు టిడ్కో ద్వారా ఫ్లాట్లు అప్పగించి పేద కుటుంబాలు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరలోనే పూర్తి స్థాయిలో ఫ్లాట్లు అప్పగించేలా చర్యలు చేపట్టాం. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఇళ్లను సక్రమంగా వాడుకుని సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి.

–దవులూరి దొరబాబు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం

చాలా ఆనందంగా ఉంది



సొంతింటి కల సాకారమైనందుకు చాలా ఆనందంగా ఉంది. ఉమ్మడి ఇంటిలో చాలీ చాలని గదుల్లో ఉన్న మాలాంటి కుటుంబాలకు టిడ్కో ఇళ్లు ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఒక్క రూపాయి రిజిస్ట్రేషన్‌తో ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంటిని ఇచ్చిన ప్రభుత్వానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుంది.

–తటవర్తి నాగలక్ష్మి, లబ్ధిదారు, గుడివాడ, ఒకటో వార్డు, పెద్దాపురం

ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు



జగ్గయ్య చెరువులో కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, స్థానిక నాయకులు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో 'గడప గడపకూ'

పిఠాపురం: గతంలో ఏ పని జరగాలన్నా కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకున్న వారే కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలన్నీ ప్రజల ఇంటి వద్దకే చేరుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మంగళవారం పిఠాపురం 20వ వార్డు జగ్గయ్య చెరువు కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి పలకరించి, ప్రభుత్వం అందజేసిన పథకాల వివరాలను తెలియజేశారు. అన్ని వారికి అందాయా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. తమకు నవరత్నాల పథకాలు అందుతున్నాయంటూ అందరూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోను ఏదో ఒక పథకం వర్తించిందని, ఒక్కో ఇంట్లో నాలుగు నుంచి ఆరు పథకాల వరకూ అందుకుంటున్న లబ్ధిదారులు ఉన్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు సీఎం జగన్ అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందేలా చేసి అవినీతికి తావు లేకుండా చేశారన్నారు. ఈసందర్భంగా ఆయన కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బాలిపల్లి రాంబాబు, కౌన్సిలర్లు కావాడ పూసయ్య, చింతాడ నీలవేణి, బండి రవి, రెడ్డెం జనార్దనరావు అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

జెడ్పీ సీఈఓ రమణారెడ్డి



అనూరులో వలంటీర్లకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

పెద్దాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఆనూరు సచివాలయంలో ఆయన పర్యటించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలిచ్చారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ ప్రభుత్వ సంక్షేమం అందాలనే ఉద్దేశంతో సీఎం జగన్ పలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ అశోక్‌కుమార్, సర్పంచ్ అనితారాణి, మాజీ ఎంపీటీసీ సింగన త్రిమూర్తులు, నరేష్ తదితరులు ఉన్నారు.

కార్యక్రమాన్ని సద్వినియోగం చేయాలి : దవులూరి దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా జూలై ఒకటో తేదీ నుంచి అమలవుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద నియోజక వర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష పథకంలో ఉచితంగా అందజేసే సర్టిఫికెట్లను అందించనున్నట్టు తెలిపారు. వీటితో పాటు ఆయా సచివాలయాల పరిధిలో నవరత్న పథకాల్లో అర్హత ఉండి అందని వారిని గుర్తించి వారికి పథకాలు అందజేసేలా కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. వివాహమై 90 రోజుల లోపు అయిన వారికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, మున్సిపల్ చైర్‌పర్సన్లు, గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ ఎంపీపీ నెక్కంటి సాయిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత జగన్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి మణికంఠబాబు

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని సర్పంచి మణికంఠబాబు అన్నారు. అమీనాబాదులో ఉన్న ఎంపీపీ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మఒడి, విద్యాకానుక, మధ్యాహ్న భోజన పథకంతో పాటు పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య, రైతు సేవలపై ఆరా

- ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది విస్తృత పర్యటన
- సీహెచ్‌సీలో డెంటల్ స్కానర్ ఇచ్చేందుకు, పోస్టుమార్టం గది ఏర్పాటుకు హామీ



పెద్దాపురం కోల్డ్ స్టోరేజీలో ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న ద్వివేది, కలెక్టర్ కృతికా శుక్లా

సామర్లకోట: రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది మంగళవారం పట్టణంలోను, మండలంలోను విస్తృతంగా పర్యటించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యంపై రోగుల నుంచి ఆరా తీసారు. ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో డెంటల్ స్కానింగ్ లేక పోవడం వల్ల వైద్యులు ఉన్నా నిరుపయోగంగా ఉన్నారని కౌన్సిలర్లు నేతల హరిబాబు, పెండ్యాల అబ్బులు ఫిర్యాదు చేయడంతో ఆయన కలెక్టర్ ద్వారా దానిని ఏర్పాటు చేస్తామని, పోస్టుమార్టం గది కూడా ఏర్పాటుచేయిస్తానని ఆయన అన్నారు. సిబ్బంది పని తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయ క్షేత్రాన్ని, ఉండూరులోని ఆర్బీకేను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అందజేసిన మినీ ట్రాక్టర్ల వల్ల ఎంత వరకు ప్రయోజనం కలుగుతోందని రైతులను అడిగారు. పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు సాగుహక్కు కార్డులు అందజేశారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, అసిస్టెంట్ కలెక్టరు ప్రఖార్ జైన్, డీఆర్వో ఎన్‌వీవీ సత్యనారాయణ, జేడీ ఎస్.విజయకుమార్, ఏడీఏ జీవీ పద్మశ్రీ, ఏఓ ఐ.సత్య, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఉండూరు గ్రామ సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆహార భద్రతకు కోల్డ్ స్టోరేజీలు

పెద్దాపురం: రైతు ఉత్పత్తుల భద్రతకు కోల్డ్ స్టోరేజీలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. స్థానిక వాలుతిమ్మాపురం జంక్షన్‌లో కోల్డ్ స్టోరేజీలోని ఆహార ఉత్పత్తులను మంగళవారం పరిశీలించారు. జిల్లా అధికారులతో పాటు ఉద్యాన శాఖ జిల్లా అధికారి మల్లిఖార్జునరావుతో కలిసి పరిశీలించారు. ఆహార ఉత్పత్తుల నిల్వ పద్ధతులపై సంస్థ డైరెక్టర్ విజయ సారథిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోరేజ్‌లో ఉన్న ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. వారితో పాటు డీఎల్‌డీఓ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఉద్యానశాఖాధికారి ఎన్.సుజాత, చిలకమ్మ, ఏఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని లబ్ధిదారుకు వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- ఆనూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెద్దాపురం : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను పార్టీ రహితంగా, అర్హులందరికీ అందజేస్తోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడప గడపకూ ప్రభుత్వంలో భాగంగా మంగళవారం ఉదయం మండలంలోని ఆనూరు గ్రామంలో సర్పంచ్ నూకతాటి అనితారాణి, సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సింగన శివ, నాగబోయిన రాజుబాబులతో కలసి గడప గడపనూ సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ మహిళాభివృద్ధి, రైతు సంక్షేమానికి పలు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శైల గణేష్, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, కామన రామకృష్ణ, పెంకే రాంబాబు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురంలో అంగన్‌వాడీల జీపుజాతా



పిఠాపురంలో జీపు జాతా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

పిఠాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జీపుజాతా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జీపుజాతా పిఠాపురం చేరుకోగా పిఠాపురం ఉప్పాడ సెంటర్లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ చంద్రావతి, సీఐటీయూ నాయకులు కె.చిన్న, ప్రాజెక్టు అధ్యక్షురాలు సీహెచ్ రమాప్రభ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డి.తులసీదేవి, విజయ శాంత భవానీ, ప్రశాంతి, డి.బేబి, ప్రజావాణి, నాగ గన్నిక తదితరులు పాల్గొన్నారు

పెద్దాపురానికి చేరిన జాతా..

పెద్దాపురం: అంగన్‌వాడీల సమస్యలపై ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ చేపట్టిన జీపుజాత మంగళవారం పెద్దాపురం చేరుకుంది. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు జాతకు స్వాగతం పలికారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచుతానన్న సీఎం వెంటనే వాటిని అమలు చేయాలన్నారు. జూలై 10న అంగన్‌వాడీల కొర్కెల దినోత్సవంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద 48 గంటల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సూరంపేట సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని సూరంపేట వాసుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు హామీ ఇచ్చారు. ఆయన మంగళవారం సూరంపేటలో పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు తమకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వర్షం వస్తే ఇంట్లోంచి నుంచి బయటకు రాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తాత్కాలిక రహదారి నిర్మాణం, తాగునీటి సరఫరాకు అవసరమైన నిధులు మంజూరు చేస్తు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మొగలి అయ్యారావు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, పర్ల రాజా, జ్యోతుల భీముడు సూరంపేట వాసులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కిర్లంపూడి: లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగినట్టు కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం, తూర్పుపాకల గ్రామానికి చెందిన ఆకుల నాగమణి(47) తన భర్త అప్పారావుతో కలిసి సోమవారం ఏలేశ్వరంలో వారి బంధుల ఇంట జరుగుతున్న శుభకార్యానికి వెళ్లారు. తిరిగి ప్రయాణంలో మోటారుసైకిల్‌పై వస్తుండగా సోమవరం జాతీయ రహదారిపై వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే నాగమణి మరణించింది. మృతి రాలికి కూతురు ఉంది. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో బంధువుల అరెస్టు

కొత్తపల్లి: వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25వ తేదీన శ్రీరాంపురం శివారు పాటివారిపాలెంకు చెందిన పాటి రూపాదేవి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో అత్తమామలను పాటి తాతారావు, సత్యవతితో పాటు ఆడపడుచులు కుక్కల సత్యవేణి, అనుసూరి దుర్గా భవానీలను ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ అరెస్టు చేసినట్లు తెలిపారు. భర్త శ్రీనివాస్ పిఠాపురం కోర్టులో లొంగిపోగా రిమాండు విధించినట్టు తెలిపారు.

30న కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ఈనెల 30వ తేదిన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సాధారణ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. పట్టణ పరిధిలో అభివృద్ధి పనులకు సంబందించి అజెండాలో 20 అంశాలు పొందురిచామని, వాటిపై చర్చించడానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

'జగనన్న సురక్ష' సర్వే పరిశీలన

కొత్తపల్లి: గ్రామలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి పుష్పామణి అన్నారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, ఉప్పాడలోని జరుగుతున్న ఈ సర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఈ సర్వేపై గ్రామ సచివాలయ సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. వలంటీర్ల పరిధిలోని ప్రతి 50 ఇళ్లకు వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకోవాలన్నారు. జూలై ఒకటి నుంచి వారికి కావలసిని సర్టిఫికెట్లు ఉచితగా అందజేస్తామని తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు నవరత్న పథకాలు అందని వారిని కూడా గుర్తించాలని వలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ ప్రసాద్, ఈఓపీఆర్డీ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

జగ్గంపేట: మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులను జగ్గంపేట పోలీసులు కోర్టుకు హాజరుపరచగా ఇద్దరకి జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.20వేల జరిమానా విధించినట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... జగ్గంపేటలో రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న బి.రంజిత్, యు.శ్రీను, డి.వీరబాబు, ఎన్.గుర్రయ్యలను పట్టుకున్నారు. వీరిని పెద్దాపురం కోర్టులో మంగళవారం హాజరుపరచగా పెద్దాపురం జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ వాహనాలు నడిపిన బి.రంజిత్, యు.శ్రీనులకు ఒక్కక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు. డి.వీరబాబుకు రెండు రోజులు జైలు శిక్ష, ఎన్.గుర్రయ్యకు 5 రోజులు జైలు శిక్ష విధించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తరచూ నిర్వహిస్తున్నామని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ల దొంగలు

పిఠాపురం: పట్టణంలో సెల్ ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వీరి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నామని పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు. గత కొన్ని రోజులుగా సెల్ ఫోన్ దొంగతనాలు పెరిగి పోవడంతో వీరి వద్ద నుంచి పూర్తి సమాచారం రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.